బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే వివేకానంద్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం గాజులరామారం డివిజన్ ఆక్సిజన్ పార్కు, ఉషోదయ కాలనీల్లో బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ.. గతంలో మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఈ ప్రాంతాభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డికి మల్కాజ్‌గిరిలో ఏ సంబంధం ఉందని ప్రశ్నించారు. రాగిడి లక్ష్మారెడ్డి స్థానికుడని, ఆయన్ని గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పరుస్తారన్నారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తనకు ఈ ప్రాంతంతో 20 ఏళ్లుగా అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశె శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయరామ్ రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, చిన్న చౌదరి, గోవర్ధన్ రెడ్డి ఉన్నారు.

బతుకమ్మకుంట అభివృద్ధి పనులు మొదలు



పనులను పరిశీలిస్తున్న గాజులరామారం ఏఈ తిరుపతి

జగద్గిరిగుట్ట: ఎట్టకేలకు భూదేవిహిల్స్‌లోని బతుకమ్మకుంట పనులు మొదలైయ్యాయి. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఫ్లోరింగ్ టైల్స్, బారికేడింగ్‌తో పాటు మెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చుట్టుపక్కలున్న కూనా మహాలక్ష్మినగర్, ఆర్‌జీకే, భూదేవి హిల్స్ మహిళలు గతంలో ఇక్కడ బతుకమ్మ పండుగ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడేవారు. అంతే కాకుండా కుంట చుట్టూ ఉన్న స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. ఈక్రమంలో గత ఏడాది అక్టోబర్‌లో బతుకమ్మకుంట అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్ శంకుస్థాపన చేయగా శనివారం పనులు ప్రారంభమయ్యాయి. ఆధునిక హంగులతో మోడల్ బతుకమ్మ కుంటగా తీర్చిదిద్దుతామని గాజులరామారం ఏఈ తిరుపతి ఈ సందర్భంగా తెలిపారు.

వివాదాస్పదంగా పార్కు ప్రహరీ కూల్చివేత

సుభాష్‌నగర్: కోర్టు వివాదంలో ఉన్న పార్కు స్థలం చుట్టూ ఉన్న ప్రహరీని స్థానికులు కూల్చివేయడం వివాదాస్పదంగా మారింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. సూరారం ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న సిద్ధి వినాయకనగర్ సర్వే నంబర్ 105లో 1978లో కాలనీ వెంచర్ ఏర్పాటైంది. ఇందులో పార్కు, ప్రజా అవసరాల నిమిత్తం వెయ్యి గజాలకు పైగా స్థలాన్ని వదిలారు. సదరు స్థలం సూరారం ప్రధాన రోడ్డుకు దగ్గర్లో ఉండటంతో కొంతమంది స్థలంపై కన్నేశారు. గతంలో ఈ స్థలం కబ్జా చేసేందుకు ప్రయత్నించగా.. అప్పుడు కూడా కాలనీవాసులు అడ్డుకున్నారు. ఆపై స్థలం చుట్టూ ప్రహరీ కట్టడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ప్రస్తుతం ఈ స్థల వివాదం కోర్టు పరిధిలో ఉంది. తాజాగా రెండు రోజుల క్రితం కొందరు ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తుండటంతో కాలనీవాసులు అడ్డుకున్నారు. దీంతో కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్‌పై సదరు వ్యక్తులు దాడి చేయడంతో గాయపడ్డాడు. శుక్రవారం రాత్రి కాలనీవాసులు ప్రహరీ కూల్చడంతో సూరారం పోలీసులు కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు.

ఆటోడ్రైవర్లకు అండగా బీఆర్ఎస్ పార్టీ



ఆటో డ్రైవర్లకు మద్దతు పలుకుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

సుభాష్‌నగర్: ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా షాపూర్‌నగర్ ఆటో యూనియన్ డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. మహిళల ఉచిత బస్సు పథకంలో ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఇప్పటి వరకు నలభైకి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని చెప్పారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా లేకపోవడం బాధాకరమన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని దుయ్యబట్టారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.15 వేల గౌరవ వేతనం ఇవ్వాలని లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



సమావేశంలో కమిషనర్ సత్యనారాయణరావు

దుండిగల్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మూడు నెలల పాటు అధికారులు సమన్వయంతో పని చేయాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు అన్నారు. శనివారం మిషన్ భగీరథ, మున్సిపల్ ఏఈ, వార్డు ఆఫీస్లు, వాటర్‌మన్‌లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడుతూ.. వార్డుల్లో తాగునీరు సక్రమంగా సరఫరా చేసే బాధ్యత వార్డు ఆఫీసర్లదేన్నారు. తాగునీరు వృథా కాకుండా ఇంటింటికి తిరిగి సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం హెచ్‌ఎండబ్ల్యూస్ డీజీఎం మహేశ్వరరావు, మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజినీర్ వసుధ వార్డుల వారీగా సరఫరా చేస్తున్న నీటి పరిమాణం గురించి తెలియజేశారు. అదే విధంగా మున్సిపల్ ప్రజలు తాగునీటి కనెక్షన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం, జతపరచాల్సిన డాక్యుమెంట్లపై అవగాహన కల్పించారు. సమావేశంలో మున్సిపల్ ఏఈ ప్రవీణ్ కుమార్, మేనేజర్ నర్సింహులు, వార్డ్ ఆఫీసర్లు, వాటర్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపుతో భవిష్యత్తుకు ఊతం



రంగారెడ్డినగర్: మానవజాతి మనుగడకు మూలాధారమైన నీటిని పొదుపుగా వాడుకుని.. భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆదర్శనగర్ సొసైటీ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య అన్నారు. ప్రపంచ నీటి వారోత్సవాల్లో భాగంగా శనివారం అభ్యుదయ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదర్శనగర్‌లోని గుడ్‌షెపర్డ్ స్కూల్ విద్యార్థులతో కలిసి శంకరయ్య అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. భూగర్భ జలాలు అడుగంటడంతో నేడు దేశంలోని పలు నగరాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందన్నారు. ఇళ్ల ముందు ఇంకుడు గుంతల ఏర్పాటు చేయడంతో పాటు పొదుపుగా నీటిని వాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడ్‌షెపర్డ్ స్కూల్ యాజమాన్యం, కాలనీ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కబ్జాదారులకు అధికారుల అండదండలు!

3,500 గజాల స్థలంపై దుండగుల కన్ను

- టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలపై అనుమానాలు
- భగత్‌సింగ్‌నగర్‌లో వెలుగు చూసిన సంఘటన
- కబ్జాలపై గతంలోనే 'సాక్షి'లో కథనం ప్రచురితం



అధికారులు ముగ్గు పోస్తున్న భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలం ఇదే

చింతల్: ఓ స్థలం విషయంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ గాజులరామారం టౌన్‌ప్లానింగ్ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు పలు అనుమానాలకు తీవిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ సర్వే నంబర్ 155 లోని ఖాళీగా ఉన్న 29 గుంటలు(3,500 గజాలు) స్థలం ఉంది. 2007లోనే ఈ స్థలానికి సంబంధించి కొలతలతో కూడిన లేఔట్‌ను అప్పటి ఎమ్మార్వో.. జీహెచ్‌ఎంసీ అధికారులకు అందజేయగా 90 శాతం మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయితే, స్థలానికి ఆనుకొని ఉన్న ధోబీఘాట్ వాసులు అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. కాగా, గత ఏడాదిలో మిగిలిన ఫెన్సింగ్ పనుల కోసం నిధులు మంజూరు కాగా ప్రస్తుత డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు మోకాలడ్డటమే కాకుండా సర్వే పేరుతో కబ్జాదారులకు అనుకూలంగా పనిచేశారు. దీంతో 3,500 గజాల స్థలాన్ని ఏడు ప్లాట్లుగా చేసి అమ్మేందుకు కబ్జాదారులు సిద్ధమయ్యారు. అంతేకాకుండా శనివారం ముగ్గు పోసే పనులు చేపట్టడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇదే అంశంపై 'సాక్షి'లో 'ఫెన్సింగ్ వేయరు.. సర్కారు స్థలం కాపాడరు' అనే శీర్షికతో కథనం వచ్చింది. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు సంతోశ్‌కుమార్, నరేశ్.. భగత్‌సింగ్‌నగర్‌లోని సదరు స్థలంలో ముగ్గు పోసే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో ఇంజినీరింగ్ అధికారి సంపత్‌కు, టౌన్ ప్లానింగ్ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. తనకు టౌన్ ప్లానింగ్ నుంచి లేఅవుట్ ఇస్తే అక్కడ ఫెన్సింగ్ వేస్తామని సంపత్ చెప్పగా.. తాము ముగ్గు వేసిన చోటే పనులు చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులు పేర్కొనడం గమనార్హం. దీంతో ఇటీవల చేపట్టిన సర్వే రిపోర్ట్ ఇవ్వనిదే ఫెన్సింగ్ వేయనని ఏఈ సంపత్ చెప్పడంతో కొంత వాగ్వాదం జరిగింది. దీంతో చేసేదేమీ లేక ఏఈ సంపత్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారి అక్కడి నుంచి వెనుతిరిగారు. అనంతరం టౌన్ ప్లానింగ్ అధికారులు, దీబీఘాట్ వాసులు సైతం అక్కడి నుంచి వెళ్లిపోయారు.

తేటతెల్లమైన 7 ప్లాట్ల అమ్మకం..

దోబీఘాట్, భగత్‌సింగ్‌నగర్ మధ్యలో ఉన్న 3,500గజాల స్థలంలో కొంతమంది కబ్జాదారులు.. సంక్షేమ సంఘ నేత, ఓ రాజకీయ నేత ప్రోద్బలంతో ఏడు ప్లాట్లు అమ్మకానికి పెట్టినట్టు స్థానికంగా పుకార్లు వినిపించాయి.నెల రోజుల క్రితం జిల్లా కార్యాలయ అధికారులు సర్వే నిర్వహించి రిపోర్టు సిద్ధం చేశారు. కాగా, శనివారం గాజులరామారం టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి ముగ్గు పోసేందుకు సిద్ధమవడంలో ఆంతర్యం ఏమిటో వారికే తెలియాలి.

జలమండలి అధికారికి ఘనంగా వీడ్కోలు



కార్యక్రమంలో పాల్గొన్న జీఎం శ్రీధర్‌రెడ్డి, అధికారులు

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ కార్యాలయం జీడిమెట్ల సెక్షన్ మేనేజర్ రాజు ఆదివారం పదవీ విరమణ చేయనున్నారు. 31వ తేదీ ఆదివారం రావడంతో శనివారం జీడిమెట్ల సెక్షన్ కార్యాలయంలో రాజును అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జలమండలి రెవెన్యూ కుత్బుల్లాపూర్ జీఎం శ్రీధర్ రెడ్డి, డీజీఎంలు అప్పలనాయుడు, ఎల్.శ్రీనివాస్, సెక్షన్ మేనేజర్లు, సిబ్బంది, కాంట్రాక్టర్లు.. రాజుకు వీడ్కోలు పలికారు.

కాంగ్రెస్‌లో మహిళలకు అధిక ప్రాధాన్యం

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఉంటుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా గంగుల అంజలియాదవ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ రఫియాబేగంలను రాష్ట్ర అధ్యక్షురాలు సునీత మొగిలిరావు నియమించగా.. శనివారం వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతి మహిళా కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు సుజాత యాదవ్, శ్రీలత, ఫరహీన్ బేగం, నాగ భవానీ, శోభరెడ్డి తదితరులున్నారు.

'మూడోసారి ప్రధానిగా మోదీ రావాలి'



కుత్బుల్లాపూర్‌లో ఈటల రాజేందర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న తారాచంద్రారెడ్డి

కుత్బుల్లాపూర్: మూడోసారి మోదీని ప్రధానిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని జీడిమెట్ల కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్, జైయరామ్‌నగర్‌లో ఈటల రాజేందర్‌కు మద్దతుగా చంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశం అభివృద్ధి పథంలో నడవాలంటే కమలం గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి, ఝాన్సీ, డివిజన్ అధ్యక్షుడు పులి బలరామ్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు బాబీ నీలా, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ, శ్రీను ముదిరాజ్, నందు గౌడ్, శ్రవణ్ గౌడ్, సందీప్ గౌడ్, మహేశ్ గౌడ్, నాగదీప్ గౌడ్, అర్జున్ తదితరులున్నారు.

ఎఫ్ కేఫ్, బార్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని క్యాపిటల్ పార్కులో ఎఫ్ కేఫ్, బార్‌ను శనివారం ప్రారంభించారు. బిగ్‌బాస్ సన్నీ, అర్జున్, మెహబూబ్, అశ్వని, తనీస్, నవీన్, మహేశ్‌లతో పాటు పలువురు సినీతారలు పాల్గొన్నారు. రుచికరమైన పానీయాలు, ఫుడ్, పల్సేటింగ్ బీట్‌లు, లైవ్ మ్యూజిక్ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్సీకి ఆహ్వానపత్రిక అందజేత

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు బాధ్యతయుతంగా పని చేయాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శనివారం శంభీపూర్‌లోని తన కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసి స్థానిక సమస్యలపై వినతులు అందజేశారు. అదే విధంగా శుభకార్యాలకు రావాలని కోరుతూ పలువురు ఆహ్వానపత్రికలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులున్నారు.

నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డులు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో ట్యాక్స్ ఫిల్లింగ్ ఇండియా ఆధ్వర్యంలో 60 మంది పారిశ్రామిక వేత్తలకు నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డులను ప్రదానం చేశారు. రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్, ఆదాయ పన్ను కమిషనర్ జీవన్‌లాల్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ మాట్లాడుతూ విజయం సాధించడంలో దృఢ సంకల్పం, ఆత్మ విశ్వాసం అవసరమన్నారు . 60 మంది పారిశ్రామికవేత్తలకు నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్యాక్స్ ఫిల్లింగ్ ఇండియా, నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డుల వ్యవస్థాపకుడు చల్లూరి శ్రీనివాస్, వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సిహెచ్ వీరభద్ర, సీఐఎస్‌ఎఫ్ కమాండో శిప్రా శ్రీవాత్సవ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, మల్లారెడ్డి నారాయణ హెల్త్‌సిటీ డాక్టర్ ప్రీతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అవార్డులు పొందిన వారిలో డాక్టర్స్ ప్రాపర్టీస్ ఎండి తమ్మినేని సత్యనారాయణ, సంకల్ప్ గ్రూప్‌కు చెందిన వీర్‌విక్రమ్, పినాకిల్ ఎడ్యుకేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సత్యశ్రీగుప్తా, వజ్ర ఈవెంట్స్ అరుణ్, మహ్మద్ గులామ్, అల్లు గోవిందరెడ్డి, జెమ్ ఓపెన్ క్యాబ్ సీఈఓ వినోద్, బీఓఆర్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ అవార్డులు పొందారు.

మలబార్ షోరూమ్ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: సుచిత్ర సర్కిల్‌లో శనివారం మలబార్ గోల్డ్ నూతన షోరూమ్ ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి, మలబార్ గోల్డ్ చైర్మన్ అహ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా బంగారు, వజ్రాల ఆభరణాలు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో షోరూమ్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంగీతంతో మానసిక ఉల్లాసం



సంగీత థెరఫీలో పాల్గొన్న విద్యార్థులు తదితరులు



నిజాంపేట్: సంగీతంతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం లభిస్తుందని తద్వారా చదువుల్లో రాణిస్తారని ఇండియన్ మ్యూజిక్ థెరపీ అసోసియేషన్ (ఐఎంటీఏ) కోశాధికారి శాస్త్రి అన్నారు. శనివారం ఐఎంటీఏ ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లోని ప్రగతి సెంట్రల్ స్కూల్‌లో విద్యార్థులకు సంగీతం ప్రాముఖ్యత, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్ ఆర్తీ మాట్లాడుతూ.. సంగీతంతో ఎన్నో రకాల మానసిక రోగాలు తగ్గుముఖం పట్టినట్టు రీసెర్చ్‌ల ద్వారా వెల్లడైందన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు సంగీతంపై మక్కువ ఏర్పడేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు గీత శ్రీ మజుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీకి తాళం

మియాపూర్ : చందానగర్ సర్కిల్–21 పరిధిలోని మియాపూర్‌లో ఉన్న హరిజన్ ఫార్మా కంపెనీ ఆర్సీ పన్నులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నందున జీహెచ్‌ఎంసీ అధికారులు శనివారం కంపెనీకి తాళం వేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని హరిజన్ ఫార్మా కంపెనీ గత కొన్ని సంవత్సరాలుగా ఆర్సీ పన్నులు రూ.కోటి నలభైఆరు లక్షలు (వడ్డీతో కలిపి) చెల్లించాల్సి ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్సీ పన్నులు చెల్లించనందున జీహెచ్‌ఎంసీ అధికారులు కంపెనీకి నోటీసులు పంపారు. స్పందించకపోవడంతో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి కంపెనీ గేట్లకు తాళాలు వేశారు.

అలరించిన కళా నీరాజనం

మాదాపూర్: శిల్పారామంలో శనివారం ఎస్‌వీఎస్ కళానికేతన్ కళానీరాజనం కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు. హేమ వనసర్ల శిష్య బృందం వినాయకకౌతం, చక్కనితల్లికి, బాలా త్రిపుర సుందరి, మూషిక వాహన, ముద్దుగారే యశోద, రామ కోదండరామ, జతిస్వరం, అష్ట లక్ష్మీ, పుష్పాంజలి తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు జస్విత్రశ్రీ, తన్మయి, హర్షిణి, శ్రీదర్శిని, సహస్ర, అనన్య, అనూష, వర్ష తదితరులు పాల్గొన్నారు.

రజాకార్ సినిమాను బ్యాన్ చేయాలి: ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్: మత విద్వేషాలను రెచ్చగొడుతూ, చరిత్రను వక్రీకరిస్తూ మతాల మధ్య వైషమ్యాలు సృష్టించే రాజాకార్ సినిమాను బ్యాన్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం శనివారం హిమాయత్‌నగర్‌లోని సత్య నారాయణరెడ్డి భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర మాట్లాడుతూ... రెండు మతాల మధ్య వైరుధ్యాలను సృష్టించి ఘర్షణలకు బీజేపీ తెరలేపిందని ఆరోపించారు. 'మనుషులను చంపగలరు కానీ మా మతాన్ని, హిందువులను చంపలేరు' అనే డైలాగులతోనే వివాదం చేస్తున్నారన్నారు.

కొనసాగుతున్న వార్షికోత్సవం

రంగారెడ్డినగర్: డివిజన్‌లోని ఏపీహెచ్‌బీ కాలనీలోని రేణుక ఎల్లమ్మ ఆలయ అష్టమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం 6 గంటలకు దేవతార్చనలు, 8 గంటలకు గోపూజ, యాగశాల ప్రవేశం, చండీ హోమం, గ్రామ శాంత్యార్థం, నవగ్రహ శాంతి హోమం, మహా పూర్ణాహుతి, మహా కుంబాభిషేకం, పండిత సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏప్రిల్ 2న జర్నలిస్టుల సదస్సు

కుత్బుల్లాపూర్: వచ్చే నెల (ఏప్రిల్) 2వ తేదీన నిర్వహించే జర్నలిస్టుల సదస్సును విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. 'ప్రజాస్వామ్యంలో ఎన్నికలు–ఓటు హక్కు' అనే అంశంపై వక్తలు మాట్లాడతారని తెలిపారు. ఈసీఐఎల్ ఏఎస్‌రావు నగర్‌లోని డాక్టర్ హోమీ జె బాబా కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల నిఘా వేదిక తెలుగు రాష్ట్రాల కన్వీనర్ డాక్టర్ వీవీ రావు, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరహత్ అలీ, కోశాధికారి మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరువుతారని తెలిపారు.

కాంగ్రెస్‌తో మహిళాభ్యున్నతి



అంజలియాదవ్‌కు నియామకపత్రం అందజేస్తున్న హన్మంతరెడ్డి

నిజాంపేట్: మహిళాభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆరు గ్యారంటీలతో మహిళలకు ఎంతో లబ్ధి చేకూరిందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా గంగుల అంజలి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ రఫియాలను జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి నియమించగా.. వారికి శనివారం హన్మంతరెడ్డి నియామకప్రతాలు అందజేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహిళా ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డిని గెలిపించే బాధ్యత మహిళలపైనే ఉందన్నారు.

పోలీసుల అదుపులో చరస్ విక్రేత



ఉదయ్‌కుమార్

దుండిగల్: ఇతర రాష్ట్రాల నుంచి నిషేధిత చరస్‌ని తీసుకొచ్చి విక్రయిస్తున్న యువకుడిని బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు శనివారం పట్టుకున్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని ఎస్ఆర్‌కే హోమ్స్‌కు చెందిన రామ్మోహన్‌రావు కుమారుడు కనగల ఉదయ్ కుమార్(29) కుక్క పిల్లలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి స్మగ్లింగ్ చేయడం మొదలుపెట్టాడు. ఈక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ నుంచి గంజాయికి సంబంధించిన చరాస్‌ను తీసుకొచ్చి ఒక్కో గ్రాము రూ.8 వేలకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు ఉదయ్‌కుమార్‌ను శనివారం గండిమైసమ్మ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.75 వేలువ కలిగిన 94 గ్రాముల చరాస్, రూ.11 వేల నగదు స్వాధీనం చేసుకుని దుండిగల్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విరబూసిన కానుగ

ఔషధ గుణాలు కలిగిన మొక్కల్లో కానుగ కూడా ఒకటి. వేసవి కాల ప్రారంభ దశలో చెట్టు మొత్తం పూలు ఆకులతో విరగకాసి అందాన్ని, ఆహ్లాదాన్ని పంచుతోంది. జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని బీర్ ఫ్యాక్టరీ వద్ద కానుగ చెట్టును చూపులను ఆకట్టుకుంటుంది. – సుభాష్‌నగర్

